# ఎలా చెప్పను?

– కాకాని కమల

దారిద్ర్యానికి మారురూపంలా వుంది ఆగుడిసె.

అమావాశ్య చీకటిలా సందె పొద్దు ముసురుతూంది.

పుట్టిన పాపానికి ఎలాగో అలా బతక్క తప్పదనిపించే గాలివాటపు జీవితాల్లా అక్కడక్కడ వెలుగు ప్రస రిస్తూంది.

పెరట్లో బావిగట్టున గన్నేరుచెట్టు కింద కూర్చుంది పాతికేళ్ళ ఊర్వసి. ఆమె అసలు పేరు ఉమామహే శ్వరి. పెట్టుడు పేరు ఊర్వసి. పేరుకి తగ్గ అందం లేకపోయినా ఓ మోస్తరుగా బాగానే వుంటుంది.

ఇంకా బాగా చీకటి ముదిరాక లేచి ఆ బావి చప్టామీద స్నానం చేసి ఇస్త్రీ చీర కట్టి పౌడరు అద్ది ముస్తాబు అవుతుంది. జడల్లుకుని మల్లెచెండు పెట్టుకుని ఒంటికి సెంటు కొట్టి రోడ్డుమీదికి వెడు తుంది. సంపాదనకోసం తెల్లారే దాకా తిప్పలు.



''ఊర్వసక్కా'' పెరటి తలుపు తెరుచుకుని పదమూ డేళ్ళ మోహిని లోపలికి వచ్చింది. ఆమెతోపాటే కమ్మని పుల్లిపాయల వాసన.

''ఏంటి మోహినీ.''

''ఇవిగో అక్కా తిను. సుబ్బయ్య మిర్చిబండి నుంచి వేడి వేడి వుల్లిపకోడీలు, మిర్చిబజ్జీ తెప్పించా. నిన్న అడిగావుగా'' అంటు పొట్లం చేతిలో పెట్టింది.

వేడి మిర్చి కొరుకుతూ తానూ బావిగట్టున ఊర్వసి ఎదురుగా కూర్చుంది.

''అక్కా! నిన్ను చూస్తే నాకేవనిపిస్తోందా తెలుసా? పోలిక పెట్టకూడదుగాని అశోకవనంలో సీతలాగ అగపి స్తవ్. ఈ దరిద్రపు కొంపలోకి ఎలా వచ్చిపడ్డవక్కా. నిన్ను చూస్తే నాకు జాలనిపిస్తుంది. ఎన్నిసార్లు అడిగినా నీ కథ చెప్పవెందుకని?''

ఊర్వసి పకోడి నములుతూ అంది. ''చెప్పి ఏమిటి ప్రయోజనం?''

''ప్రయోజనం అంటే లేదనుకో. కాని ఈడున్న వాళ్ళంత ఆళ్ళ గురించి ఏవ్వేవ్వో కతలు చెప్తారు. కాని నువ్వు మటుక్కు నోరు విప్పవు నిశ్శబ్దపు బొమ్మలాగుం టావ్. పైగా ఆళ్ళల్లా వికవిక నవ్వుతూ విచ్చలవి డిగా వుండవు. బలవంతపు ఈవృత్తి చేస్తు న్నట్లుగ నాకు అగపిస్తావ్...''

ఊర్వసి మెత్తగా నవ్వింది.

కాని అది నవ్వులా లేదు. తీతూపిట్ట ఏడి చినట్లుంది.

''చెప్పక్కా! అసలు నువ్వీ పాడువృత్తిలోకి ఎలా వచ్చావ్?''

ఊర్వసి నోరు విప్పింది.

''మోహినీ! నువ్వు చిన్నపిల్లవి. ఎంత చెప్పితే నీకర్థం అవుతుంది. నాకథలో ప్రత్యేకతేం లేదు. ఈ కొంపలో వున్న అందరి కథల్లాంటిదే నాదీ. కాస్త అటు ఇటుగ. నాకు సవిత తల్లి, ఎన్నో బాధలు పెట్టేది. ఒకరోజు జొన్నలు తెమ్మని డబ్బిచ్చి బజారుకి పంపింది. ఎలా జరిగిందో తోవలో ఆ డబ్బు పోయింది. జొన్నలు లేకుండా ఇంటికి వెడితే పిన్ని కొడుతుందని పార్కులో ఏడుస్తు కూర్చున్నాను. ఒకాయన నా దగ్గరికి వచ్చి ఎందుకేడుస్తున్నావని అడిగాడు. ప్రేమగా పలకరిం చాడు. పక్కనేవున్న బండి నుంచి ఐస్‌క్రీం కప్పు కొని చ్చాడు. ఆ ప్రేమకి ఆపేక్షకి నేను ఏడిచాను. అప్పుడు. నా వయసు పదకొండేళ్ళు.

''నాతో వస్తావా? మీ పిన్ని బాధవుండదు. కూర్చుని తినచ్చు. మంచి బట్టలు, పౌడర్లు సెంట్లు చిరుతిళ్ళు అన్నీ దొరుకుతాయి. నిన్నెవరూ కొట్టరు. అందరూ ముద్దులు పెట్టుకుంటారు.'' అన్నాడు.

ఆశపడ్డాను. నేపోగొట్టుకున్న ఇరవై ఆయన ఇచ్చాడు. ఆ డబ్బుతో జొన్నలు కొన్నాను. ఆ మర్నాడు ఆయన చెప్పిన టైముకి పార్కుకి వెళ్ళాను.

కారులో వేరే ఊరు తీసుకెళ్ళి ఒక పెద్ద బంగళాలో నన్ను దించాడు. అక్కడ 'నాగరత్నమ్మ' అనే ఆవిడకి నన్ను అప్పగించి వెళ్ళిపోయాడు. ఆ తరువాత తెల్సింది అది ఒక వేశ్యా గృహం అని. నాకు బాగా లోక జ్ఞానం తెలిశాక ఆ జీవితం నాకు నచ్చలేదు. కాని తప్పించుకోలేకపొయ్యాను. నా ఇరవై ఏళ్ళ వయసులో నాగరత్నమ్మ జబ్బుపడి చనిపోయింది. ఆ ఇంటి మీద పోలీసుల నిఘా ఎక్కువైంది. ఆ గృహంలో వాళ్ళందరూ ఎవరిదారి వారు చూసుకున్నారు. నేను ఇక్కడకి వచ్చాను. అంతే.'' చెప్పటం ఆపి మళ్ళీ మిర్చి కొరికింది ఊర్వసి.

''మోహినీ... ఓస్ పిల్లా మోహినీ'' పక్క గడపలోంచి కేక వినిపించింది.

''అత్త పిలుస్తోంది. పోతున్నా'' అంటు పరికిణి కుచ్చులు పైకి పట్టు కుని మోహిని పరిగెత్తింది.

చీకట్లో కదిలిపోతున్న మోహిన్ని చూస్తూ ఊర్వసి నిట్టూర్చింది.

''ఊర్వసీ! నువ్వు ఇప్పుడు మోహి నికి చెప్పిన నీ కథ నిజమేనా?'' అంతరాత్మ నిలదీసింది.

''కాదు. కల్పితం'' అంది ఊర్వసి తప్పు ఒప్పుకుంటున్నట్లు.

''మరి ఎందుకు అబద్ధం చెప్పావ్? సవితి తల్లి- పదకొండు ఏళ్ళ చిన్నవ యసు- అంటు...''

ఊర్వసి పెదవి విరిచింది.

''ఏం చెయ్యమంటావ్? నా పద్దెని మిదేళ్ళ వయసులో నాకన్న తండ్రే కసాయి వెధవలా డబ్బుకోసం నన్ను ఇక్కడ అమ్మేశా డని, తాగుడూ జూదం వాడి వ్యసనాలని, మా నాన్నకి ముగ్గురు పెళ్ళాలని, కూతురికి పెళ్ళానికి తేడా తెలి యని వెధవ మా నాన్న అని ఎలా చెప్పమంటావ్?...

... తండ్రి కూతుళ్ళ బంధం ఈ సృష్టిలో అతి పవిత్రం అయ్యింది. కాని ఆ పవిత్ర బంధాన్ని కూడా అపవిత్రం చేసే నికృష్టపు తండ్రులున్నారని, కూతుర్ని కూడా కామపు దృష్టితో చూసే నీచపు తండ్రులు కూడా ఈ కలికాలంలో వున్నారని ఆ పసిపిల్లకి ఎలా చెప్పమం టావ్? మానాన్న చేష్టలు ప్రవర్తన వాగుడు తల్చుకుంటే ఇప్పటికీ నాకే తలవంపుగా అసహ్యంగా అనిపి స్తుందే... అలాంటిది నోరువిప్పి ఇంకొకరికి ఎలా చెప్ప మంటావ్?...'' అంది వెక్కిళ్ళ మధ్య ఊర్వసి అంతరా త్మతో దెబ్బలాడుతున్నట్లు.

ఆ చీకట్లో చీకటిలా మోకాళ్ళ మధ్య తలపెట్టుకుని ఊర్వసి ఏడుస్తుంటే అంతరాత్మ జాలిగా చూసింది.

★